# మారిన విలువలు



"**నా**న్నా... నాన్నా... రిజల్టు వచ్చాయి నాన్నా... నేను ఫస్టుక్లాసులో ప్యాసయ్యాను" అంటూ ఉత్సాహంగా లోపలికి వచ్చాడు ప్రసాద్.

"నిజంగానే..! ఎంత మంచి వార్త తీసుకువచ్చావు నాన్నా..! అని, "ఏమేవ్... అబ్బాయి పి.యు.సి. ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడే!" అంటూ లోపలికి చూస్తూ ఒక్క అరుపు అరిచాడు రామనాథంగారు.

"నిజంగానే..! నా బంగారు తండ్రి ఫస్టుక్లాసులో నేమిటీ- కాలేజీలోనే ఫస్టు వస్తాడని అనుకుంటూనే ఉన్నాను. ఏం బాబూ... కాలేజీలో ఎవరు ఫస్టు వచ్చిందీ ఇంకా తెలియలేదా?" అంది కామేశ్వరమ్మగారు.

"ఆ... ఆ.... నీ గారాల కొడుకు కాలేజీలో నేమిటీ- మొత్తం యూనివర్సిటీలోనే ఫస్టు వస్తాడు" అన్నాడు రామనాథంగారు నవ్వుతూ.

"ఏం- రాకూడదా ఏమిటి? వచ్చేవాళ్ళంతా కొమ్ములు తగిలించుకొని ఉన్నారా యేమిటి?" అంది కామేశ్వరమ్మగారు.

"పిచ్చిదానా... కొమ్ములు తగిలించుకున్నా, మొలిపించుకున్నా ఈరోజుల్లో ఏమీ విలువ లేదు" అన్నాడు రామనాథంగారు భారంగా.

ప్రశ్నార్థకంగా భర్తవంక చూసింది కామేశ్వరమ్మగారు.

"అవునే... ఎనభై రూపాయల ఉద్యోగానికి ఎమ్మే వాళ్ళు కూడా ఎగబడుతున్న రోజులివి. ఎంత చదివినా ఈ రోజుల్లో ఏమీ విలువ లేదే..!" అన్నాడు రామనాథంగారు.

"విలువ లేదని ఊరుకుంటామా..? ఇబ్బందో సబ్బందో పడి పైచదువులు చెప్పించుకోకుండా ఉంటామా..?" అంది కామేశ్వరమ్మగారు.

తన పరిస్థితి తెలిసిన రామనాథంగారు ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు. సంభాషణను మార్చే ఉద్దేశంతో- "అది సరేగానీ.., అబ్బాయి ఎంతో మంచివార్త తీసుకువస్తే నోరైనా తీపిజెయ్యవా యేమిటీ..?" అన్నాడు రామనాథంగారు.

"అయ్యో- నా మతి మండిపోనూ..! ఉండండి- ఇప్పుడే పటిక బెల్లం తెస్తాను" అంటూ లోపలికి వెళ్లింది కామేశ్వరమ్మగారు.

"నాన్నగారూ... తర్వాత ఏ కోర్సులో చేరమంటారు?" అన్నాడు ప్రసాద్.

"నువ్వేమనుకుంటున్నావు?" అన్నాడు రామనాథంగారు.

"నేనైతే బి.యస్సీ.లో చేరాలనుకుంటున్నాను" అన్నాడు ప్రసాద్.

"సరేలే... ఆలోచించి నిర్ణయిద్దాంలే..!" అన్నాడు రామనాథంగారు.

"సరే... నేను ఓసారి అలా ఊళ్లోకి వెళ్లి నలుగురు స్నేహితులనీ కలిసివస్తాను" అన్నాడు ప్రసాద్.

"ఇదుగో... ఈ పటిక బెల్లం నోట్లో వేసుకుని వెళ్లు" అంటూ తిరిగి ప్రవేశించింది కామేశ్వరమ్మగారు.

"అలాగే..!" అంటూ పటిక బెల్లం తీసుకుని బయటకు వెళ్లిపోయాడు ప్రసాద్.

"అబ్బాయి ఏమిటంటున్నాడు?" అంటూ మాట కలిపింది కామేశ్వరమ్మగారు.

"ఏముందీ- బి.యస్సీ.లో చేరతానంటున్నాడు. కాని, బి.యస్సీ. అంటే మాటలా? చేరేటప్పుడు నాలుగు వందల రూపాయల ఖర్చు. పైగా... రేపు పద్దెనిమిదికే కాలేజీలు తెరుస్తారట. ఏం చేయాలో పాలుపోవడం లేదు" అన్నాడు రామనాథంగారు.

"ఏం చేస్తాం చెప్పండీ... చక్కగా చదువుకుంటున్న కుర్రవాడు- తల తాకట్టు పెట్టయినా చదివించక తప్పుతుందా?" అంది కామేశ్వరమ్మగారు.

"ఎంత తేలికగా చెప్పావు? తీసుకునేవాడుంటే తలేమిటి- మొత్తం నా శరీరమే తాకట్టు పెడతాను. పైగా... ఈ నెలలోనే నీ పురుటి రోజులు కూడాను. వాడి చదువు ఆపగలవేమోగాని.., నీ పురుడు ఆపలేను గదా!" అన్నాడు రామనాథంగారు బాధగా.

"ఎలాగూ నా పురుటి కోసం అప్పుజేయాలి కదా... దానితోపాటే వాడి చదువు కోసం కూడా చేయండి" అంది కామేశ్వరమ్మగారు.

"ఎంత సులువుగా చెప్పావు- అప్పు చేయమని?! పోయిన సంవత్సరం నీ పురుటికి చేసిన అప్పే ఇంకా తీరలేదే... ఇప్పుడు ఇంకా ఎవరిస్తారు? పైగా... నవ్వుతారు కూడా- ఏమిటయ్యా... ఈ కాన్పులు అని!" అన్నాడు రామనాథంగారు ఆవేదనతో.

"ఊరుకోండి... ఎవరో అంటారని మన పిల్లలు మనకి భారం అవుతారా?" అంది కామేశ్వరమ్మగారు నోరు నొక్కుకుంటూ.

"పిల్లలెందుకు భారమవుతారే... అప్పు భారం కాని! నేనూ ఏ లక్షాధికారినో అయితే, ఇప్పుడున్న ఏడుగురు కాక- మరొక పదిహేడుమంది పిల్లలున్నా బాధపడేవాడిని కాదు. నాకొచ్చే మూడు వందలలోనూ నువ్వూ, నేనూ, అమ్మా, ఏడుగురు పిల్లలూ ప్లస్ పుట్టబోయే అష్టముడూ కలిసి ఎలా బ్రతకడం?, ఎలా బట్ట కట్టడం?,- ఎలా వీళ్ళందరికీ చదువు సంధ్యలు చెప్పించడం?" అన్నాడు రామనాథంగారు.

"మాటిమాటికీ ఏడుగురు పిల్లలని బాధపడకండి. అందులో ఐదుగురు మగ పిల్లలే కదా! దైవానుగ్రహం వల్ల రేపు పుట్టబోయే బిడ్డ కూడా మగ బిడ్డే కావచ్చును. అసలు జాతకం ప్రకారం కూడా నాకు మగ బిడ్డలే ఎక్కువ. మగ పిల్లలంటే స్థిరాస్తి కాదుటండీ..? వాళ్ళ చదువుల కోసం ఇవాళ మనం ఖర్చు పెట్టినా రేపు అదంతా కట్న రూపేణా తిరిగి మనకి వచ్చేదే కదా..!" అంది కామేశ్వరమ్మగారు.

"అయ్యో రామ! వాళ్ళు మగ పిల్లలనేనే నా బాధ..! ఆడపిల్లలైతే ఎలాగయినా ఓ అయ్య చేతిలో పెట్టాల్సిన వాళ్ళమే కనుక చదువు సరిగా చెప్పించినా, చెప్పించకపోయినా ఫర్వాలేదు. కాని.., మగ పిల్లల్ని బాగా చదువు చెప్పించి పైకి తీసుకురాకపోతే... నువ్వు స్థిరాస్తి అన్నది కాస్తా అప్పయి కూర్చుంటుంది" అన్నాడు రామనాథంగారు బాధతో కూడిన చిరునవ్వుతో.

"పోదురూ... ఏమి ఎగతాళి చేస్తారు! కనేదానిని నాకు బాధ లేదు కాని, మధ్య మీకు వచ్చింది!" అంటూ మూతి విరిచింది కామేశ్వరమ్మగారు.

"ఓర్పులో నువ్వు సాక్షాత్తూ భూదేవివి. ఏడుగురు పిల్లలు పుట్టి ఎనిమిదోవాడు పుట్టబోతున్నా ఇంకా నీకు బిడ్డల మీద మోజు తీరలేదంటే- నిజంగా నీకు 'పద్మశ్రీ' బిరుదు ఇయ్యవచ్చు" అని హాస్యమాడాడు రామనాథంగారు.

"మీకు పుణ్యముంటుంది- తడవ తడవకీ ఏడుగురూ, ఎనమండుగురూ అంటూ లెక్కబెట్టకండి. నరుడి కంటికి నల్లరాయి పగులుతుందనీ- మన బిడ్డలకి మనమే దిష్టికొట్టుకుంటామా..?" అంది కామేశ్వరమ్మగారు బాధగా.

"అదేంలేదు. కన్నందుకు బిడ్డలను ప్రయోజకులుగా చేయాలి. కన్నవారే తమకి అన్యాయం చేశారని బిడ్డలు బాధపడకూడదు. ఓసారి అలా పోయి అప్పులకోసం ప్రయత్నం చేసి వస్తాను" అంటూ బయటకు నడిచాడు రామనాథంగారు.

* * *

ఆరోజు పోస్టుమ్యాన్ రామనాథంగారికి ఉత్తరం ఒకటి ఇచ్చి వెళ్లాడు.

అది చదవగానే కుప్పకూలిపోయాడు రామనాథంగారు.

"ఏదో ఉత్తరం వచ్చినట్లుందే... ఎక్కడినుంచండీ?" అంటూ ప్రవేశించింది కామేశ్వరమ్మగారు. భర్తని చూస్తూనే కంగారుగా- "అయ్యో... అదేమిటండీ, అలా ఉన్నారు?" అని అడిగింది.

రామనాథంగారు ఏమీ మాట్లాడకుండా ఉత్తరం ఆమె చేతికి ఇచ్చాడు.

కంగారుగా ఆ ఉత్తరాన్ని వణుకుతున్న చేతులతో అందుకుని, తడబడుతున్న పెదవులతో చదువుకుని "ఓయి- మీ ఇల్లు బంగారంగానూ! అమ్మాయి ఇంటికి వస్తున్నానని శుభవార్త రాస్తే అలా జావగారిపోయినారేమిటండీ..?" అంది కామేశ్వరమ్మగారు.

"ఇదేమైనా న్యాయంగా ఉందిటే? తొలి చూలు అందరికీ పుట్టింటిలో జరగాలి కనుక ఎలాగూ మనకు తప్పదనుకో! కాని, మలి చూలికి కూడా అమ్మాయిని మన నెత్తిమీదికి తోలితే నేనేమైపోవాలి చెప్పు?" అన్నారు రామనాథంగారు బాధగా.

"అల్లుడుగారు వ్రాశారు కదండీ... పాపం- వాళ్ళ ఊళ్లో పురుడికి సదుపాయాలు సరిగ్గా లేవని, లేకుంటే పంపిస్తారా యేమిటి?" అంది కామేశ్వరమ్మగారు.

"మరే... ఆ ఊళ్లో ఎవరూ పురుళ్లు పోసుకోవడం లేదు కాబోలు! అంత సదుపాయాలు లేవని పంపదల్చుకున్నవాడు- ఆ చేత్తోటే పైకం కూడా పంపలేక పోయాడూ..?" అన్నాడు రామనాథంగారు కసిగా.

"హవ్వ- అప్రతిష్ట! పురిటి ఖర్చులకని ఆయన డబ్బిస్తే మాత్రం మనం తీసుకుంటామా? ఎవరైనా వింటే నవ్విపోతారు!" అందామె నోరు నొక్కుకుంటూ.

అంతలో... ప్రకాష్ ప్రవేశించాడు- అపుడే కాలేజీనుంచి వస్తూ.

"నాన్నగారూ... కాలేజీలు తెరిచి పది రోజులైంది. ఫస్టుక్లాసు స్టూడెంటుని కనుక నాకు సీటు రిజర్వు చేసి ఉంచారు. ఇంకా నాలుగు రోజులలో జీతం కట్టకపోతే పేరు కొట్టేస్తారు" అన్నాడు దిగులుగా.

రామనాథంగారు ఏమీ సమాధానం చెప్పకుండా "బాబూ... ఈ ఉత్తరం చదువుకో!" అంటూ అల్లుడు దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని కొడుకు చేతికి ఇచ్చాడు.

అది చదివి ప్రకాష్- "అయితే... అక్కయ్య కూడా పురిటికి ఇక్కడికే వస్తుందన్న మాట!" అన్నాడు.

"అవును బాబూ... ఈ నెలలోనే మీ అమ్మకీ పురిటి రోజులు. ఆ ఖర్చే చూడనా, నీ జీతమే కట్టనా..? నాకేమీ పాలుపోవడం లేదు" అన్నారు రామనాథంగారు అమితమైన దిగులుతో.

"అయితే... నాన్నగారూ-" అంటూ ఏదో చెప్పబోయాడు ప్రకాష్.

"నీ చదువు గురించి ఆందోళన పడకు బాబూ... నా శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాను" అని భరోసా ఇచ్చాడు రామనాథంగారు.

* * *

రామనాథంగారి అమ్మాయి సుబ్బాయమ్మ పురిటికి వచ్చింది. అల్లుడు వెంకట్రావు ఆమెను ఆస్పత్రిలో చేర్పించి పురుడు పోయించాడు.

ఆరోజు సాయంత్రం రామనాథంగారు దొడ్లో కలుపు మొక్కలు పీకుతున్నారు. అప్పుడే ఆస్పత్రి నుంచి వెంకట్రావు వచ్చాడు.

అల్లుడిని చూడగానే రామనాథంగారు- "ఏం బాబూ... అమ్మాయిని ఎప్పుడు డిశ్చార్జి చేస్తారు?" అని అడిగాడు.

"మరొక వారం పడుతుందండీ. ఇంక పిల్లలు పుట్టకుండా స్టెరిలైజేషన్ ఆపరేషన్ కూడా చేయించేశాం" అన్నాడు వెంకట్రావు.

రామనాథంగారు నిర్ఘాంతపోయాడు. కొంచెం తెప్పరిల్లుకొని, "ఏమిటి బాబూ... ఇద్దరు పిల్లలతోటేనా?" అని అడిగాడు.

"చాలదుటండీ... ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. పిల్లల్ని కనగానే సరికాదు. వాళ్ళని పెంచి పెద్దచేయాలి కదా!" అని అన్నాడు వెంకట్రావు.

ఆ మాట సూటిగా తగలడంతో, మారుమాట్లాడక నోరు మూసుకుని, ముఖం మాడ్చుకుని కూర్చున్నారు రామనాథంగారు.

"ఏమండోయ్... మీరు, మీ అల్లుడుగారు సావిట్లోకి రండి- కాఫీ తెస్తున్నాను" అని కేక పెట్టింది కామేశ్వరమ్మగారు. రామనాధంగారు పని ఆపి చేతులు కడుక్కుని సావిట్లోకి వచ్చారు. వెనకాలే వెంకట్రావు కూడా వచ్చాడు.

కామేశ్వరమ్మగారు సావిట్లోకి కాఫీ తీసుకుని వచ్చింది.

రామనాధంగారు కాఫీ తీసుకుంటూ- "విన్నావా... అమ్మాయి ఇంక పిల్లలు వద్దనుకుని ఆపరేషన్ చేయించుకుందిట."

"అయ్యో-అయ్యో... దానికి ఇదేమి పాడుబుద్ధి పుట్టిందండీ..?" అంటూ వాపోయింది కామేశ్వరమ్మగారు.

"ఏం చేస్తాం చెప్పండి... క్రిందటిసారి పురుడే కష్టమయింది. ఈసారి మొదట్నుంచీ మందులూ, అవీ ఇప్పిస్తూ వచ్చాం. భగవంతుడి దయవల్ల ఈసారి సవ్యంగానే గడిచింది. ఆందోళనతో అనుక్షణం జీవించడంకన్నా ప్రత్యక్ష నరకం ఏమి ఉంటుంది చెప్పండి?" అన్నాడు వెంకట్రావు.

"కన్నతల్లిని... కనీసం నాతో ఒక్కమాటన్నా చెప్పలేదు అమ్మాయి. అంత కానిదాన్నై పోయానా?" అంది కామేశ్వరమ్మగారు నిష్టూరంగా.

"ఏమి చెప్తుంది చెప్పండి- చెప్తే అనవసరమైన రాద్ధాంతమే కదా!" అన్నాడు వెంకట్రావు.

"ఏమోలెండి బాబూ... ఎప్పుడైతే మీ భార్య అయిందో- అప్పటినుంచి మీ ఇష్టం, మీ ఆవిడ ఇష్టం! మధ్య మా ఇష్టాఇష్టాల మాట ఏముంది?" అంటూ ముఖం ముడుచుకుని లోపలికి వెళ్లిపోయింది కామేశ్వరమ్మగారు.

"మామగారూ... మిమ్మల్ని అంటున్నానని అనుకోకండి. ఏడుగురు బిడ్డలున్న వారు మీరు. రేపోమాపో ఎనిమిదో బిడ్డకి తండ్రి కాబోతున్నారు. సంసారంలోని సాధక బాధకాలు బాగా తెలిసిన మీరే మా నిర్ణయాన్ని హర్షించకపోతే నేనేం చెప్పగలను?" అన్నాడు వెంకట్రావు కొంచెం బాధగా.

"హర్షించకపోవడం కాదు బాబూ... ఈ ఆపరేషన్లు చేయించుకున్న వాళ్ళకి రకరకాల కొత్త రోగాలు వస్తున్నాయని వింటూంటే ధైర్యంగా ఎలా చేయించుకోవడం?" అన్నారు రామనాధంగారు.

"ఒక కొత్త మార్పు వచ్చినప్పుడల్లా ప్రజలలో మొదట్లో దానిని గురించి అనేకమైన భయాలు పుట్టి ఎన్నెన్నో పుకార్లు వెలువడుతాయి. ఇంగ్లాండు వంటి దేశంలోనే రైళ్లు వచ్చిన కొత్తల్లో అవి దయ్యాల చేష్టలని భయపడేవారట!" అన్నాడు వెంకట్రావు.

"అవన్నీ సరేననుకో. భగవంతుడు కల్పించే సృష్టిని మానవుడు నిరోధించడం ప్రకృతి విరుద్ధం కాదా?" అన్నారు రామనాధంగారు.

"అక్కడే మీరు పొరబడుతున్నారు. సంతాన నిరోధమన్నది ప్రకృతిలోనే ఉంది. పాము చూడండీ... వేలకొద్దీ గ్రుడ్లని పెట్టినా- అందులో ఒకటి, రెండు మినహా అన్నీ తనే తినేస్తుంది. గండు పిల్లి తనకి పుట్టిన వాటివే అయినా- పిల్లి పిల్లల్ని చంపేస్తుంది. అసలు నిజానికి... జంతువులలో కామవాంఛ కేవలం ఒక ప్రత్యేక ఋతువుకి మాత్రమే పరిమితమై ఉంటుంది. ఇంతెందుకు... ఇందాక మీరు దొడ్లో కలుపు మొక్కలను పీకుతున్నారు- ఎందుకు? మీరు కావాలనుకున్న మొక్కలను చక్కగా పెంచాలనే కదా..! అలాగే మనం కనే బిడ్డలని కూడా చక్కగా పెంచి పైకి తీసుకురావలసిన బాధ్యత మన మీద ఉంది కదా..! పదిమందిని కని, ఎందుకు పుట్టామురా... అని బాధపడేటట్లు పెంచడంకంటే- సంతానాన్ని ఇద్దరు, ముగ్గురుతో పరిమితం చేసుకుని వాళ్ళను ప్రయోజకులుగా చేయడం మంచిది కాదూ..?" అన్నాడు వెంకట్రావు ఆవేశంగా.

"నీవు చెప్పినవన్నీ బాగానే ఉన్నాయి కాని.., అసలు ఈ ఆపరేషన్ లేకుండా సంతానాన్ని క్రమబద్ధం చేసుకునే మార్గాలు లేవా?" అని అడిగాడు రామనాధంగారు ఆసక్తితో.

"ఎందుకు లేవూ? అసలు మనదేశంలో పూర్వకాలంలో ప్రజలు వాత్స్యాయన కామసూత్రాలవంటి వాటిని శ్రద్ధగా చదివి ఆ విధంగా ఆచరించేవారు. అవి వ్యక్తులకు మనో నిగ్రహం అలవరచి క్రమబద్ధమైన సంతానాన్ని కలిగించేవిగా చేసేవి. ఈనాటి ప్రజలకు నిగ్రహం అనే మాటకు అర్థంకూడా తెలియనందువల్ల తప్పనిసరిగా ఇతర మార్గాలు అవలంబించాలి. నిరోధ్‌లు, లూప్‌లు వంటి అనేక ఇతర సాధనాలున్నాయి. వీటిని గురించి మీరు ఏవైద్యుని అడిగినా ఆయన ఉచిత సలహా ఇస్తాడు" అన్నాడు వెంకట్రావు ఆనందంతో.

"బాబూ... వయస్సుకు చిన్నవాడివైనా ఎన్నో పెద్ద విషయాలు నేర్చుకున్నావు" అని అభినందించాడు రామనాధంగారు.

"నేనూ మొదట్లో సంతాన నిరోధానికి వ్యతిరేకినే. కాని.., మీ అమ్మాయి ఆరోగ్యం విషయం చూసినా, నా ఆర్జన బట్టి భవిష్యత్తును అంచనా వేసుకున్నా- ఇద్దరు పిల్లలు చాలని తృప్తిపడ్డాము. నేనే ఆపరేషన్ చేయించుకోవాలనుకున్నాను. కాని, అందుకు మీ అమ్మాయి ఒప్పుకోక తానే చేయించుకుంటానంది. ఎందుకంటే- ఏ కారణంచేతనైనా తాను అకాల మృతి చెందితే, నేను మళ్లీ పెళ్ళి చేసుకుంటే... ఆమె నా మూలంగా సంతానహీన కాకూడదనే ఉద్దేశంతో అలా చేసింది" అన్నాడు వెంకట్రావు.

"చిన్నపిల్లయినా ఎంతటి ఆదర్శభావాలు కలది మా అమ్మాయి?" అని ఆశ్చర్యపోయారు రామనాథంగారు.

"నేను మళ్లీ ఆస్పత్రికి పోయి వస్తా. మా పల్లెటూళ్లో ఈ ఆపరేషన్ సదుపాయాలు లేవనే ఇక్కడ పురుడు పోయించాను" అంటూ లేచాడు వెంకట్రావు.

"మంచిది. పోయిరా బాబూ..!" అన్నాడు రామనాథంగారు.

వెంకట్రావు చెప్పిన విషయాలన్నీ రామనాథంగారి మదిలో మెదులుతూ, కొత్తకొత్త ఆలోచనలని రేపుతున్నాయి. ఆయన ఆ విషయాలన్నీ భార్యతో చెప్పారు. ఎప్పుడూ లేని విధంగా ఆమెలో కూడా కొత్త కొత్త వింత ఆలోచనలు రాసాగాయి.

* * *

ఆరోజు రామనాథంగారు కంగారుగా ఇంట్లోకి ప్రవేశించారు.

వస్తూనే- "ఇదుగో... ఏమేవ్- నిన్నే... ఎక్కడ వున్నావు?" అంటూ అరుచుకుంటూ వచ్చారు.

"ఏమి జరిగిందండీ?" అంటూ కంగారుగా ప్రవేశించింది కామేశ్వరమ్మగారు.

"మన ప్రకాష్‌ని పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు" అంటూ రొప్పుతూ చెప్పాడు రామనాథంగారు.

"ఇదేమి అన్యాయమండీ... ఎవ్వరి జోలికీ పోనివాడిని పోలీసులు అరెస్టు చేయడమేమిటండీ?!" అంటూ కుప్పకూలిపోయింది కామేశ్వరమ్మగారు.

"ఏముందీ... ఎంత ప్రయత్నించినా వాడి కాలేజీ జీతానికి పైకం సమకూర్చలేక పోయాను కదా! దాంతో మనిషి నిరాశ చెందాడు. కాలేజీ విద్యార్థులు ఎందుకో సమ్మె చేస్తుంటే వీడు దానికి నాయకత్వం వహించాడుట. సమ్మె చేసే విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు వచ్చేసరికి గొడవ ప్రారంభమైంది. నాయకులందర్నీ వీడితో సహా అరెస్టు చేశారు" అని జరిగింది చెప్పారు రామనాథంగారు.

"మనం ఏదో విధంగా కాలేజీలో చేర్పించి ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేది కాదు" అని నొచ్చుకుంది ఆవిడ.

"ఏడుగురు సంతానం ఉన్నవాళ్ళం- మనమేమి చెప్పిస్తామే?! ఏ ఇద్దరో, ముగ్గురో అయితే ఎంత చదువైనా చెప్పించవచ్చు. ఆ అదృష్టం మనకి లేదు" అంటూ వాపోయారు రామనాథంగారు.

"ఇదంతా చూస్తుంటే అమ్మాయి మంచిపనే చేసింది అనిపిస్తోంది. ఈసారి నేను తప్పక ఆపరేషన్ చేయించుకుంటాను" అంది కామేశ్వరమ్మగారు.

"అంటే... నీకు జ్ఞానోదయం అయిందన్నమాట! అందుకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అన్నారు రామనాధంగారు సంతోషంతో.

"ఇందులో అభినందించడానికి ఏముందండీ? కాకపోతే... ఈ పని మనం ఏ ఇద్దరు, ముగ్గురు తర్వాతో చేసి ఉంటే ఎంత బాగుండేది- అనుకుంటున్నాను" అంది కామేశ్వరమ్మగారు.

"నిజమే కాని.., ఆ రోజుల్లో ఈ అవసరం అంతగా లేదు. ఈ విషయాలు ఎవరికీ సరిగ్గా తెలియవు. ఇప్పుడున్నన్ని సౌకర్యాలూ లేవు. కానీలే.., ఇప్పటికైనా మనకి అల్లుడూ, అమ్మాయిల ధర్మమా... అని కనువిప్పు కలిగింది" అన్నాడు రామనాధంగారు.

"దానికేం లెండి- కాని, మన ప్రకాష్ విషయమే చాలా బాధపడ్తున్నాను" అంది కామేశ్వరమ్మగారు కళ్లు తుడుచుకుంటూ.


"ఎందుకు? అరెస్టయినందుకా? మరేం ఫర్వాలేదు. కాసేపు రిమేండ్‌లో ఉంచి సాయంత్రం లోపల విడుదల చేస్తారు" అన్నాడు రామనాధంగారు.

"అది కాదండీ....వాడి చదువు విషయం నా పుస్తెల తాడు అమ్మైనా సరే... వాడికి చదువు చెప్పించండి. పసుపుకొమ్మే నా మాంగల్యంగా భావించుకుంటాను. నా మాంగల్యం బిడ్డల భవిష్యత్తుకి ఉపయోగపడడం కంటె కావలసిందేముంటుంది?" అంది కామేశ్వరమ్మగారు ఆవేశంగా.

"తల్లి హృదయాన్ని అర్థంచేసుకోడం ఎవరి తరం? నేను మళ్లీ గట్టి ప్రయత్నం చేస్తాను. అదీ ఫలించకపోతే నీవు చెప్పినట్లే చేస్తాను. వెళ్లి- వాడిని విడిపించుకు వస్తాను" అన్నారు రామనాధంగారు గాద్గదిక కంఠంతో.

ఆ క్షణంలో వారిద్దరి ముఖాల్లోనూ ఓ కొత్త వింతకాంతి ప్రకాశింపజొచ్చింది. ఆనందంతో తడబడుతున్న అడుగులతో బయటకు వెళ్లారు రామనాధంగారు.

*– ఆంధ్రభూమి దిన పత్రిక... 31 అక్టోబర్ '71*



## <u>పవర్ లెస్</u>

ఒక ఎలక్ట్రిక్ ట్రెయిన్ స్టేషన్‌లో ఉండగా పవర్ ఫెయిల్యూర్ అయింది. అందువల్ల చాలాసేపు అక్కడే ఉండిపోయింది. ప్రాణం విసిగిన ప్రయాణీకులు స్టేషన్‌మాస్టర్ రూంలోకి జొరబడి ఫిర్యాదు చేశారు.

"సారీ... ఈ విషయంలో నేను పవర్ లెస్!" అని తన అశక్తతను తెలియజేశాడాయన.